
కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ వినాయకరావునగర్‌లో పర్వతాంజనేయ స్వామి దేవాలయాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో కొద్ది రోజులుగా అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఫిర్యాదు మేరకు షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అక్రమ నిర్మాణాలను గురువారం కూల్చివేశారు.

సైట్-3లో..

బోరబండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సైట్-3లో బలహీన వర్గాల కాలనీ కాంప్లెక్స్‌లపై అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఖైరతాబాద్ తహసీల్దార్ మహ్మద్ నయీంఉద్దీన్ హెచ్చరించారు. గురువారం పెద్దమ్మ నగర్ కాంప్లెక్స్ ఇంటిపై అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సైట్-3 కాంప్లెక్స్‌లో కొన్ని ఇళ్లు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిపై నిర్మాణాలు చేపడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అక్రమ నిర్మాణాల వెనుక సచివాలయ ఉద్యోగి ప్రమేయం ఉన్నట్లు సమాచారం ఉందని, స్థానికులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, స్పెషల్ ఆర్ఐ కిరణ్‌రాజ్, ఆర్ఐలు అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.


తల్లిపాల వారోత్సవంలో కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు

తల్లిపాలతో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపు

ఖైరతాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ పిల్లలకు 6 నెలల వరకు తల్లిపాలు తప్పక ఇచ్చేలా చూడాలని కార్పొరేటర్ విజయారెడ్డి, సీడీపీవో ప్రతినిధులు అవగాహన కల్పించారు. గురువారం ఖైరతాబాద్ బీజేఆర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రు పాలు పట్టాలని, ఆరు నెలల అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే బాలామృతం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సీడీపీవో పుష్పలత, సూపర్‌వైజర్ షీలావతి, అంగన్‌వాడీ టీచర్లు సుమతి, పద్మావతి, సత్యమణి, వీణ, రేణుక పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాల కల్పనకు చర్యలు

ఎర్రగడ్డ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ నూర్ మసీద్ ప్రాంతంలోని శ్మశాన వాటికలో సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ అధికారులు గోపాలకృష్ణ, రిజ్వాన్ తెలిపారు. గురువారం శ్మశానవాటికలో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో అధికారి గౌస్, ఏఐఎంఐఎం నాయకులు మహ్మద్ అజీర్, శ్మశానవాటిక మేనేజర్ సయ్యద్ ఆరిఫ్ పాల్గొన్నారు.

నీలిమ ఆస్పత్రిలో నేడు గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం

ఎర్రగడ్డ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నీలిమ ఆస్పత్రిలో 'నీలిమ 9' పేరుతో గర్భిణులకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆస్పత్రి ఎండీ నీలిమా శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద గర్భిణులకు చేయూతనివ్వడానికి ప్రతినెల 9వ తేదీన వైద్య శిబిరంలో పేరు నమోదు చేయించుకున్న వారికి ఉచితంగా మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ప్రతినిధులు

హామీలను నెరవేర్చాలి

ఖైరతాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. రమ, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం. హన్మేష్ మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డు, ఇంటి స్థలం లేనివారికి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు, అర్హులైన వారికి పింఛన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట బీమాతో పాటు కొత్త రుణాలను ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, ప్రతినిధులు పద్మ, నాగేశ్వరరావు, రామకృష్ణ, నల్లన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి

రేపు రా రైస్ మిల్లర్స్ ఆత్మీయ సమ్మేళనం

పంజాగుట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోగల జేకే కన్వెన్షన్‌లో ఈనెల 10న రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రా రైస్ మిల్లర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ తమను పట్టించుకోలేదని ఆరోపించారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో తమకు ఎలాంటి ప్రాధాన్యం లేదన్నారు. రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. సమావేశంలో పలు అంశాలను చర్చించి, నూతన కమిటీని ఎన్నుకుంటామన్నారు. కమిటీ సభ్యులు సురేష్, ప్రవీణ్, సతీష్, కిష్టయ్య, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు అభినందనలు


పదోన్నతుల అంశం పరిష్కరించినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రత్నాకర్‌రావు, శ్రీధర్, బీసీ రెడ్డి, వరప్రసాద్, వేణుగోపాల్, సదానందం, వేణు, వెంకటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

- మూడేళ్లుగా పరిష్కారం కాని సమస్య
- అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం
- మురుగునీటితో ఓల్డ్ కస్టమ్స్ బస్తీ వాసుల ఇబ్బంది

పేదల బస్తీలంటే ప్రజాప్రతినిధులు, అధికారులకు చిన్నచూపు. బస్తీలలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకునే వారే ఉండరు. సివరేజీ లైన్ జామ్ అయి మ్యాన్ హోల్స్ పొంగి మురుగునీరు ఇళ్ల వద్ద నిలుస్తోందని, తరచూ రోగాల బారిన పడుతున్నామని కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీటికి తోడు వర్షపునీరు నిలవడంతో దోమలకు ఆవాసంగా మారడంతో పలువురు డెంగీ బారిన పడ్డారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

నిత్యం మురుగుతో ఆవాసం

బేగంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో పలుచోట్ల మురుగు సమస్య తీవ్రంగా ఉంది. బస్తీ దిగువన ఉన్న ప్రాంతంలో నుంచి నాలా వరకు వెళ్లే లైన్‌లో సివరేజీ పైపులైన్ వేయడంతో సమస్య ఏర్పడింది. పురాతన పైపులైన్ కావడంతో నిత్యం జామ్ అయి మురుగు నీరు పొంగి పొర్లుతోంది. బస్తీలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జికి ఎగువన ఇంటి నంబరు 1-11-50/5/ఎ పక్కన ఉన్న గల్లీలో మూడేళ్లుగా మురుగునీరు నిల్వ ఉంటోంది. 365 రోజులూ సివరేజీ పైపులైన్ లీకవుతోంది. దీంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు సమస్యను అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ టి. మహేశ్వరి దృష్టికి తీసుకెళ్లగా బస్తీలో పర్యటించారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నలుగురికి డెంగీ

ఇటీవల కురిసిన వర్షాలకు బస్తీలో మురుగు నీరు నిలువ ఉన్న ప్రాంతంలో వర్షం నీరు చేరింది. నిత్యం మురుగునీరు నిలువ ఉండడంతో దోమలకు ఆవాసంగా మారింది. దీంతో తాగునీరు సైతం కలుషితం అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉన్న సమీపంలో గల ఓ ఇంట్లో యువకుడు డెంగీ బారిన పడ్డాడు. అదే ఇంట్లో మరొకరికి కామెర్లు సోకాయి. వీరితోపాటు ఆ ప్రాంతంలో మరో ముగ్గురు డెంగీ బారిన పడినట్లు బస్తీకి చెందిన వారు తెలిపారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసంగా మారడం వల్ల రోగాల బారిన పడుతున్నామని, ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోయారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో మురుగునీరు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికా బద్ధంగా చదివితే ఉన్నతస్థాయికి చేరుకుంటారని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. షేక్‌పేట్ ఎస్సీ వెల్ఫేర్ ఎక్సలెన్స్ హైస్కూల్, జూనియర్ కళాశాలలో గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. జీవితంలో ఇంటర్మీడియట్ విద్య టర్నింగ్ పాయింట్ లాంటిదని, ఇంటర్ తర్వాత బీటెక్, ఐఐటీ, నిట్, బిట్స్‌లో చేరేందుకు విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. విద్యతోనే గౌరవం పెంపొందుతుందన్నారు. అనంతరం కళాశాలలోని ల్యాబ్‌ను పరిశీలించి సౌకర్యాలు, మరమ్మతుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ యాదయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.బాలస్వామి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశం, జోనల్ ఆఫీసర్ భీమయ్య తహసీల్దార్ అనితారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ హరికృష్ణ, ఎస్‌డబ్ల్యూఆర్‌టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పంజాగుట్ట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్ఎంసీ సర్కిల్-17 డీఎంసీ జగన్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం తుమ్మలబస్తీలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంగపుత్ర సంఘం, మత్స్యకార సంఘం రహదారిలో మట్టి, చెత్త కుప్పలను సిబ్బంది తొలగించారు. మొక్కలు నాటడానికి అనువైన ప్రదేశాలను గుర్తించారు. యూబీడీ మేనేజర్ జ్యోత్స్న, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఎంటమాలజీ సిబ్బంది అయూబ్ ఖాన్, అబ్దుల్ సత్తార్, అసద్ అలీ, వార్డు మెంబర్ మున్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌నగర్‌లో..

జీహెచ్ఎంసీ సర్కిల్ 18 ఆధ్వర్యంలో ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మహిళా, యువజన సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి వెరోనిక, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి భగవాన్ దాస్, ఫీల్డ్ ఆఫీసర్ భావ్‌సింగ్, రిసోర్స్ పర్సన్ జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కృష్ణకాంత్ పార్కులో...

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కులో జీహెచ్ఎంసీ సర్కిల్-19 సిబ్బంది, కార్మికులు వ్యర్థాలను తొలగించారు.

మొక్కల పంపిణీ

బోరబండ: అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వినాయకరావునగర్, బంజారానగర్, సైట్-2లో అధికారులతో కలిసి పర్యటించి మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ భరత్, కాంగ్రెస్ నాయకులు కె.మహేష్‌గౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ టాలెంట్ పరీక్షకు 400 మంది హాజరు

ఖైరతాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ 2024-25పై నిర్వహించిన బడ్జెట్ టాలెంట్ పరీక్షకు మంచి స్పందన లభించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) కళాశాల ఆధ్వర్యంలో అనలాగ్ ఐఏఎస్ అకాడమీ, అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ సహకారంతో నిర్వహించిన ఈ పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 50 కళాశాలల నుంచి డిగ్రీ, పీజీ చదువుతున్న 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన ముగ్గురికి నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి న్యూ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల విద్యార్థి శ్రీకాంత్, రెండవ బహుమతి నిజాం కళాశాలకు చెందిన కళ్యాణ్ రాజ్, మూడో బహుమతి అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌కు చెందిన విద్యార్థి ప్రాచి గోయల్ గెలుచుకున్నారు. మరో ఐదుగురికి ప్రోత్సాహక బహుమతులను కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ అందజేశారు. బడ్జెట్ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెంపొందించేందుకు, విద్యార్థుల్లో వ్యక్తిగత, ఆర్థికపరమైన విషయాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతియేటా బడ్జెట్ టాలెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విజేతలతో ఐఐఎంసీ కళాశాల ప్రతినిధులు

స్టార్ ఆస్పత్రి నుంచి హోం శాంపిల్స్ సేవలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి రాలేని వారు, వృద్ధులు, వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి శాంపిల్స్ సేకరించే కార్యక్రమానికి స్టార్ ఆస్పత్రి శ్రీకారం చుట్టింది. నానక్‌రాంగూడలో స్టార్ ఆస్పత్రి జాయింట్ మెనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ రమేష్‌గూడపాటి, బంజారాహిల్స్‌లో సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జరీడాక్టర్ లోకేశ్వరరావు సజ్జ గురువారం 'హోమ్ శాంపిల్స్' సేవలను ప్రారంభించారు. పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఉదయం, రాత్రి వేళల్లో శాంపిల్స్ సేకరిస్తామన్నారు. హోం శాంపిల్ కలెక్షన్ కోసం బుక్ చేయడానికి 9591104108 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆర్థోపెడిక్స్ సర్జన్ డాక్టర్ నీలం వెంకటరమణారెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



హోం శాంపిల్స్ సేకరణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో స్టార్ ఆస్పత్రి జేఎండీ, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్ గూడపాటి, వైద్యులు

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కళాకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ప్రజానాట్యమండలి ప్రతినిధులు పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. క్రీడా రంగానికి ఇచ్చే ప్రాధాన్యం కళాకారులకు కూడా ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో గ్రామీణ కళలను ప్రోత్సహించాలని సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి మంత్రికి విజ్ఞప్తి చేశారు.

పర్యాటక అభివృద్ధి సంస్థలో సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతూ సంస్థ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మంత్రి జూపల్లి కృష్ణారావుకు మరో వినతిపత్రం అందజేశారు.

ఫారిన్ కోటా సీట్ల భర్తీకి 12న స్పాట్ కౌన్సెలింగ్

- ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికన సీట్ల కేటాయింపు
- జేఎన్‌టీయూ ఫారిన్ రిలేషన్స్ డైరెక్టర్ వసుమతి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో విదేశీ కోటా కింద ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి ఈ నెల 12న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జేఎన్‌టీయూ ఫారిన్ రిలేషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ డి.వసుమతి తెలిపారు. అర్హులైన ఫారిన్ నేషనల్స్ (ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూ/ఎన్ఆర్ఐ) అభ్యర్థులకు స్పాట్ కౌన్సెలింగ్‌లో ముందు వచ్చిన వారికి మొదట (ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్) ప్రాతిపదికన సీట్లను కేటాయిస్తామని ఆమె స్పష్టం చేశారు.

స్పాట్ కౌన్సెలింగ్‌కు వచ్చే అభ్యర్థులు.. దరఖాస్తు నమూనా, విద్యార్హతలు, సాధారణ సూచనల కోసం జేఎన్‌టీయూహెచ్ డీయూఎఫ్ఆర్ వెబ్‌సైట్‌ను చూడవచ్చన్నారు. ఇంజనీరింగ్ యూజీ (బీటెక్)కోర్సుల్లో 61, ఇంటిగ్రేటెడ్ పీజీ(బీటెక్+ఎంటెక్) కోర్సుల్లో 25, మేనేజ్‌మెంట్(బీబీఏ) కోర్సుల్లో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. బీటెక్ కోర్సులకు ట్యూషన్ ఫీజుగా ఎన్ఆర్ఐ అభ్యర్థులు ఏడాదికి 3,500 అమెరికన్ (యూఎస్) డాలర్లు, బీబీఏ కోర్సులకు 3 వేల డాలర్ల చొప్పున చెల్లించాలని, సార్క్ దేశాలకు చెందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శ్రీనగర్‌కాలనీలో కేక్ కట్‌చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు భవానీ శంకర్, అచ్యుత్, కిరణ్, మిరాజ్, అరుణ్ తదితరులు

జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా సీఎన్ రఘుప్రసాద్


రాజ్‌భవన్‌లో ఐదేళ్లుగా గవర్నర్ జాయింట్ సెక్రటరీగా పనిచేసిన సీఎన్ రఘుప్రసాద్ జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా నియమితులయ్యారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు గురువారం రాజ్‌భవన్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు.
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి

బేగంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి సూచించారు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏసీపీ మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌బీటీనగర్, పాటిగడ్డ ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

పంజాగుట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అల్లర్లతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని, వారి ఆస్తులను కాపాడాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ బాలస్వామితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని షేక్ హసీనా రాజీనామాతో అరాచకశక్తులు ఆధిపత్యం చలాయిస్తున్నాయని, ప్రధానంగా హిందూ సమాజంపై పెద్దఎత్తున దాడులు చేస్తూ దుకాణాలు, ఇళ్లను లూటీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ సరిహద్దులో కట్టుదిట్టమైన నిఘా, భద్రత పెంచి చొరబాట్లు జరగకుండా చూడాలని కోరారు. సమావేశంలో వీహెచ్‌పీ నాయకులు సుభాష్‌చందర్, అనిల్, ధీరజ్ పాల్గొన్నారు.

తల్లీపిల్లల అదృశ్యం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తల్లీపిల్లలు అదృశ్యమయ్యారు. రహ్మత్‌నగర్ ఎస్‌పీఆర్‌ నగర్‌కు చెందిన శామ్యూల్‌రాజ్ టైలరింగ్ పనిచేస్తుంటాడు. అతడికి శివపార్వతితో 2012లో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు. అతడి భార్య ఇటీవల ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా చేరింది. శామ్యూల్‌రాజ్ సోమవారం విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం భార్యకు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. అతడు ఇంటికి వెళ్లగా భార్య, పిల్లలు కనిపించలేదు. ఇంట్లో భద్రపరిచిన రూ. 35 వేలు, 5 తులాల బంగారం కనిపించలేదు. వారి ఆచూకీ లభించకపోవడంతో గురువారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జీహెచ్ఎంసీలో కార్మికుడిగా పనిచేసే ఎం. శ్రీహరిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వ్యాపారి కార్యాలయంలో రూ. 5.85 లక్షలు చోరీ

యూసుఫ్‌గూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారి కార్యాలయంలో నగదు చోరీ అయింది. మధురానగర్‌కు చెందిన డి. అనంత్‌నాగు వ్యాపారం చేస్తుంటాడు. తను నివసించే భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటాడు. నగదును ఆ గదిలో భద్రపరుస్తుంటాడు. ఈనెల ఒకటో తేదీన టేబుల్ డ్రాలో భద్రపరిచిన రూ. 5.85 లక్షలు కనిపించలేదు. చోరీ అయిందని బాధితుడు మధురానగర్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలకు డబ్బులివ్వాలని బెదిరించిన వ్యక్తిపై ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బోనాలకు డబ్బులు ఇవ్వకపోతే అంతుచూస్తానని బెదించిన వ్యక్తిపై పలువురు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాదగిరినగర్‌లో నివసించే బిల్లా పవన్ అనే వ్యక్తి ఇటీవల బోనాల వేడుకలు నిర్వహించాడు. రహ్మత్‌నగర్‌లో వ్యాపారం చేస్తున్న ఎం. సురేష్‌కుమార్‌కు ఫోన్ చేసి బోనాలకు డబ్బులివ్వాలని బెదిరించడంతో రూ. 10 వేలు పంపించాడు. శాంతి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ సాయిమోహిత్ మకుల్‌కు కూడా పవన్ ఫోన్ చేయగా ఆయన స్పందించకపోవడంతో తన మనుషులను స్కూల్‌కు పంపించి బెదిరించడంతో రూ. 5 వేలు ఇచ్చాడు. వీడియో గల్లీలో వ్యాపారం చేసుకునే ఎం.వినయ్‌కుమార్‌కు ఫోన్ చేసి బెదిరించటంతో రూ. 7,500 ఇచ్చాడు. బాధితులు గురువారం పోలీసులకు పవన్‌పై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న రామకృష్ణ

సమస్యలను పరిష్కరిస్తా : రామకృష్ణ

తిరుమలగిరి ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని కాలనీలు బస్తీలలో సమస్యలను పరిష్కరించుకుంటూ ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నానని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. గురువారం వార్డు-7 పరిధిలోని చిన్నకమేల, టీచర్స్ కాలనీలలో స్థానికులతో కలిసి ఆయన పర్యటించారు. టీచర్స్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కంటోన్మెంట్‌లోని సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అభివృద్ధి నిధులు కేటాయించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ కాలనీ అధ్యక్షుడు భిక్షపతి రెడ్డి, వార్డ్-7 బీజేపీ అధ్యక్షులు ప్రభు ప్రశాంత్, శ్రీధర్‌రెడ్డి, చిన్న కమేల బస్తీ నాయకులు జాన్, టీఎస్ఎంఆర్‌పీఎస్ కోర్ కమిటీ మెంబర్ నగ్నూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ-మారిటల్‌పై విద్యార్థులకు అవగాహన

తార్నాక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మహిళా సభ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేటిక్స్‌లో గురువారం ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో కళాశాల డైరెక్టర్ ప్రొ.విజయలక్ష్మి అధ్యక్షతన ప్రీ-మారిటల్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది విజేత బోరకటి, ప్రముఖ సైకో తెరపిస్ట్ పి.జ్యోతిరాజా ముఖ్యఅతిథులుగా హాజరయి ప్రీ- మారిటల్ అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ శిక్షాస్మృతి ఇప్పుడు భారతీయ న్యాయ సంహితగా రూపాంతరం చెందిదన్నారు. నేటి ఆధునిక సమాజంలో మహిళలు గృహహింసను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించవద్దని, తమ చుట్టు పక్కల ఎవరైనా గృహహింసకు పాల్పడినట్లయితే వెంటనే 181 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్ దంపతులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

చిలకలగూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్, చింతబావిలో గురువారం ఈదమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ బొద్దూరు విద్యాసాగర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి దంపతులు ప్రత్యేక అతిథులుగా విచ్చేయగా, ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.ఉమాకాంత్, ప్రధానకార్యదర్శి ఆర్.రమేష్ భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఆదివారం శ్రావణ మాస బోనాలు, అనంతరం అన్నదాన కార్యక్రమమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు.



సీతాఫల్‌మండిలో మొక్కలను పంపిణీచేస్తున్న ఉపకమిషనర్ సుభాష్‌రావు, కార్పొరేటర్ సామల హేమ

కాలుష్య నియంత్రణకు మొక్కలను పెంచాలి

బౌద్ధనగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణకు మొక్కలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం సీతాఫల్‌మండి టీఆర్‌టీకాలనీ పార్కులో నిర్వహించిన వనమహోత్సవంలో వారు మొక్కలను నాటారు. అనంతరం స్థానికులకు మొక్కలనుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడమంటే భవిష్యత్‌తరాలకు భరోసా ఇవ్వడమేనన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు కార్యాలయ ఇన్‌చార్జి సంధ్యారాణి, యూసీడీసీఓ ధనశ్రీ, హార్టికల్చర్ ఇన్‌చార్జి సురేష్, ఏఈ కౌశిక్, నాయకులు శేఖర్, రాజేష్, అశ్విన్, బాలాజీ, లక్ష్మి, లలిత, పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు, హెల్త్ కార్డులు ఇవ్వాలి

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కళాకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు అందించి, అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ప్రజానాట్యమండలి ప్రతినిధులు గురువారం పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం సమర్పించారు. క్రీడా రంగానికి ఇచ్చే ప్రాధాన్యం కళాకారులకు కల్పించాలని వారు కోరారు. తెలంగాణలో గ్రామీణ కళలను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా సీపీఐ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి మంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే పర్యాటక అభివృద్ధి సంస్థలో సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధం చేయాలని కోరుతూ సంస్థ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మంత్రి జూపల్లి కృష్ణారావుకు మరో వినతి పత్రం సమర్పించారు.

దానాపూర్ ఎక్స్‌ప్రెస్ బోగీల మధ్యన తల

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సమీపంలోని ఎస్ఎఫ్‌సీ యార్డులో క్లీనింగ్ కోసం ఆగిన దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హెచ్ఏ 1 రెండు బోగీల మధ్య ఉన్న స్ప్రింగ్‌కు గుర్తుతెలియని వ్యక్తి తల భాగమే కనిపించింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. క్లీనింగ్ సెక్షన్ వద్ద ఆగిన్న దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హెచ్ఏ ఏసీ 1 రెండు బోగీల మధ్య తల భాగం ఉందని స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తల భాగాన్ని స్వాధీనం చేసుకుని, గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ, అడ్రస్ వివరాలు ఇంకా తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు కింద పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మానసిక ఒత్తిడి భరించలేక ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేట్‌లోని ఇన్ఫ్‌టెక్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి మానసిక ఒత్తిడి భరించలేక గురువారం జెమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ వద్ద రైలు వచ్చే క్రమంలో తల రైలు పట్టాలపై పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పేరు, వివరాలు ఇంకా తెలియరాలేదని, కేసును దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.



సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహం

మహిళా న్యాయవాదిని దూషించిన

జనగామ సీఐని సస్పెండ్ చేయాలి

● పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు ● ఆందోళన ఉధృతం చేస్తాం ● సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్



సికింద్రాబాద్ సివిల్‌కోర్టులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అడ్డగుట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేసు విషయంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన మహిళా న్యాయవాదిని ఇష్టం వచ్చినట్లు దూషించిన జనగామ టూటౌన్ ఇన్‌స్పెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సికింద్రాబాద్ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 5న కోర్టు కేసు విషయంపై జనగామ కోర్టు మహిళా న్యాయవాది కవిత స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధిత తరుపు కేసు విషయంపై సీఐని వివరణ కోరిందన్నారు. దీంతో సీఐ ఇష్టం వచ్చినట్లు దూషించాడన్నారు. దీంతో ఆమె కన్నీళ్లు పెట్టుకుంటూ జనగామ కోర్టు బార్ అసోసియేసన్ సభ్యుల ముందు బాధను వెల్లడించిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత కుమార్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ కోర్టులో విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కేసులో జనగామ సీఐపై కేసు నమోదు చేయడం కాదని, వెంటనే ఆయనను సస్పెండ్‌చేయాలని లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. తెలంగాణలో న్యాయవాదులకు రక్షణ లేకుండాపోయిందని అన్నారు. విషయం తెలుసుకున్న మారేడుపల్లి పోలీసులు కోర్టు ఆవరణలో వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీనియర్ న్యాయవాది వైవీ.రమణ, ప్రధానకార్యదర్శి సుశీల్‌కుమార్, సంయుక్తకార్యదర్శి బుచ్చిబాబు, గంగాందర్‌శెట్టి, అన్నపూర్ణ, పుష్పలత, ప్రవీణ్‌కుమార్ నవీన్‌రెడ్డి, సౌమ్యతోపాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి పాఠశాలలో సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

● సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోనే మొదటిసారిగా.. ● ముఖ్యఅతిథిగా హాజరైన చినజీయర్ స్వామి



సరస్వతి అమ్మవారి విగ్రహానికి పూజలు చేస్తున్న చినజీయర్ స్వామి

బోయిన్‌పల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): 'రానున్న రోజులలో బోయిన్‌పల్లిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణం బాసర పుణ్యక్షేత్రం లాగా మారుతుంది. విద్యార్థులు భగవంతునిపైన నమ్మకంతో భక్తిని పెంపొందించుకుంటూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి' అని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. బోయిన్‌పల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బానోతు లాలు నాయక్ ప్రత్యేక చొరవతో, పలువురు దాతల సహకారంతో పాటు గిరిజన సంక్షేమ శాఖ ప్రోత్సాహంతో గురువారం సరస్వతి అమ్మవారి విగ్రహన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిన్నజీయర్ స్వామి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, టీడబ్ల్యూ ప్రత్యేక అధికారి వి.సర్వేశ్వర్‌రెడ్డి, టీడబ్ల్యూడీ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ చందన సర్పే హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి చినజీయర్‌స్వామి వస్తున్నారని తెలుసుకున్న ఆయన భక్తులు పెద్దసంఖ్యలో పాఠశాలకు తరలివచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న వివిధ ఆలయాల కమిటీల వారు చినజీయర్‌స్వామికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ రానున్న రోజులలో ఈ పాఠశాల విద్యాక్షేత్రంగా మారుతుందని, ఈ పాఠశాల విద్యార్థులకు అమ్మవారి ఆశీర్వాదాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారి కోటజీ, ఎల్‌డబ్ల్యూఓ ఎల్లమ్మ, గిరిజన సంక్షేమ అభివృద్ధి సోషల్ వర్కర్ వెంకన్నతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చెప్పినా సమస్య తీరలే..

మ్యాన్‌హోల్ నుంచి వస్తున్న డ్రైనేజీ నీరు



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న బస్తీవాసులు(ఫైల్)



మ్యాన్‌హోల్ నుంచి వస్తున్న డ్రైనేజీ నీరు

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నల్లా నీరు సరఫరా అయిన రోజు డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగి నీళ్లు బయటకు వస్తున్నాయని బస్తీవాసులు వాపోతున్నారు. మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో నాలుగు నెలల నుంచి సమస్య ఉన్నా పట్టించుకున్న వారే లేరని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మీద పారుతున్న మురుగునీటి వల్ల దుర్గంధం వస్తోందని, నడిచి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటోందని అన్నారు. ఈ విషయాన్ని మూడు వారాల క్రితం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. అయినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. మ్యాన్‌హోల్‌లో ఉన్న పూడికను పూర్తిగా తొలిగిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు వస్తున్న నీరు.. మంచినీటి సరఫరా ఆగిపోగానే నిలిచిపోతోందన్నారు. దీనివల్ల మంచినీటి పైపులైన్‌లోకి డ్రైనేజీ నీరు పోయే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అప్పుడే పుట్టిన శిశువు మృతి

ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమేనని బంధువుల ఆందోళన



మృతిచెందిన బాబు



మృతిచెందిన పసిబిడ్డను పట్టుకుని ఆస్పత్రి ముందు ధర్నాకు దిగిన కుటుంబ సభ్యులు

బోయిన్‌పల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందాడని బంధువులు ఆందోళన చేశారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గురువారం జరిగిన ఈ ఘటనపైన పోలీసుల సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... అజయ్‌కుమార్, నికిత దంపతులు. బోయిన్‌పల్లి మల్లికార్జున కాలనీలో నివాసం ఉంటున్నారు. నికిత గర్భిణిగా ఉన్నప్పటి నుంచి ఇదే ఆస్పత్రిలో చూయించుకుంటోంది. బుధవారం సాయంత్రం డెలివరీ కోసం సదరు ప్రైవేట్ ఆస్పత్రికి రాగా పురుటినొప్పుల కోసం నికితకు వైద్యులు మాత్రలు ఇచ్చి, వేసుకోమన్నారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో సర్జరీ చేస్తుండగా పేగు కట్ చేయగా బాబు పుట్టిన వెంటనే మృతి చెందినట్లు నికిత భర్త తెలిపాడు. వైద్యులు సకాలంలో స్పందించకపోవడం వల్లనే ఘటన చోటు చేసుకుందని బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహించారు. తమకు న్యాయంచేయాలని బంధువులు ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు మీడియా ప్రతినిధుల సమక్షంలో ప్రశ్నించగా 'ఇలాంటివి జరుగుతుంటాయి. అయితే ఏంటి?. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని ఆస్పత్రి యాజమాన్యం దురుసుగా ప్రవర్తించింది. ఈ క్రమంలో సకాలంలో వైద్యం అందించకపోవడం మూలంగానే బాబు చనిపోయాడని, ప్రస్తుతం తల్లి ఆరోగ్యం కూడా బాగాలేదని కోపోద్రిక్తులైన బంధువులు ఓల్డ్ బోయిన్‌పల్లిలోని ఆస్పత్రి ముందు ధర్నాకు దిగారు. దీంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌జామ్ కావడంతోపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో సమాచారం తెలుసుకున్న బోయిన్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ముందుగా ట్రాఫిక్‌ను సరిచేశారు. అనంతరం బంధువులతో మాట్లాడి వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు మీడియాకు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న వైద్యశాఖ అధికారిణి సంఘటన స్థలానికి చేరుకుని కనీసం బంధువులను పలుకరించకుండా ఏం జరిగిందోనని విచారణ జరపకుండానే వెళ్లిపోయారని బంధువులు ఆరోపించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఏసీపీ

బేగంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి సూచించారు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏసీపీ మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీటీనగర్, పాటిగడ్డ ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్

పంజాగుట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అల్లర్లతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని, వారి ఆస్తులను కాపాడాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ బాలస్వామితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని షేక్ హసీనా రాజీనామాతో అరాచకశక్తులు ఆధిపత్యం చెలాయిస్తున్నాయని, ప్రధానంగా హిందూ సమాజంపై పెద్దఎత్తున దాడులు చేస్తూ దుకాణాలు, ఇళ్లను లూటీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ సరిహద్దులో కట్టుదిట్టమైన నిఘా, భద్రత పెంచి చొరబాట్లు జరగకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ నాయకులు సుభాష్‌చందర్, అనిల్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

● షాదీముబారక్ చెక్కుల పంపిణీ



మారేడుపల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను గురువారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి తదితరులు ఉన్నారు. - (మారేడుపల్లి - ఆంధ్రజ్యోతి)

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



వైద్య చికిత్స నిమిత్తం కంటోన్మెంట్ ఐదో వార్డు మహాత్మానగర్‌కు చెందిన శివంకు రూ.32,000 సంజీవయ్యనగర్‌కు చెందిన పోచమ్మకు రూ.35,000 అడ్డగుట్టకు చెందిన మాధవికి రూ.18,000 చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి((సీఎంఆర్ఎఫ్) చెక్కులను బాధితుల కుటుంబాలకు గురువారం పంపిణీ చేశారు. వాల్మీకినగర్‌లోని తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దాల నరసింహ తన కార్యాలయంలో వారికి అందజేశారు. - (మారేడుపల్లి - ఆంధ్రజ్యోతి)

● వ్యాయామంతో ఆరోగ్యం



మెట్టుగూడ వైజంక్షన్ వద్ద ఉన్న జీహెచ్ఎంసీ పార్కులో గురువారం ఓపెన్ జిమ్ పనులను కార్పొరేటర్ రాసూరి సునీత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితానికి వ్యాయ మం అవసరమన్నారు. పనులు త్వరగా పూర్తిచేసి జిమ్ త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. - చిలకలగూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి)

● నాలా పూడికతీత పనుల పరిశీలన



స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి గురువారం తుకారాంగేట్‌లోని కొండారెడ్డి పార్కు సమీపంలో నాలా పూడికతీత పనులను పరిశీలించారు. వర్షకాలం కావడంతో నాలాల నుంచి వ్యర్థాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, దాసరి శ్రీనివాస్, దేవయ్య, శ్రీరాములు, శంకర్, మహేశ్వరి, రమాలు పాల్గొన్నారు. - (అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)

● విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలి



దిగజారిన విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలికవసతులను కల్పించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక కార్యదర్శి సీహెచ్.లక్ష్మీనారాయణ, తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భాగ్య, కొత్త సాయిలక్ష్మి, వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం రాష్ట్ర మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. అనంతరం టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యేలు వివేక్, కూనం సాంబశివరావుతో పాటు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. - (అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)

● ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలి



జీహెచ్ఎంసీ నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది కోరారు. సికింద్రాబాద్ జనరల్‌బజార్‌లోని అంజలి థియేటర్ వద్ద స్థానిక వ్యాపారులు వేసే చెత్తను గురువారం తొలగించి, ముగ్గులు వేసి అవగాహన కల్పించారు. -(రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి)

తల్లీపిల్లల అదృశ్యం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తల్లీపిల్లలు అదృశ్యమయ్యారు. రహ్మత్‌నగర్ ఎస్ఎస్‌టీ నగర్‌కు చెందిన శామ్యూల్‌రాజ్ టైలరింగ్ పనిచేస్తుంటాడు. అతడికి శివపార్వతితో 2012లో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు. అతడి భార్య ఇటీవల ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా చేరింది. శామ్యూల్‌రాజ్ సోమవారం విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం భార్యకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అతడు ఇంటికి వెళ్లగా భార్య, పిల్లలు కనిపించలేదు. ఇంట్లో భద్రపరిచిన రూ. 35 వేలు, 5 తులాల బంగారం కనిపించలేదు. వారి ఆచూకీ లభించకపోవడంతో గురువారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జీహెచ్ఎంసీ కార్మికుడిగా పనిచేసే ఎం. శ్రీహరిపై అనుమానంఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.